# 24

## ఖరీదు కట్టే షరాబు లేడు!

భారతీయ సంస్కృతి. ఏ ప్రాంతానికో ఏ కాలానికో మాత్రమే పరిమితమయి లేదు. అనంత కాలాల నుండి ఆ సేతు హిమాచల పర్యంతం, అది విడిగి విప్పారుతూనే ఉన్నది. మన దేవాలయాల నిర్మాణంలో, అక్కడి శిల్పాల్లో, మన ఆభరణాల్లో, సాహిత్యంలో, సంగీతంలో, ఆచార వ్యవహారాల్లో, నిత్య జీవితంలో, తత్వ చింతనలో ఈ సంస్కృతి అంతర్వాహినిగా ప్రవహిస్తూనే వున్నది. భారతీయ శిల్పుల ఉక్కు పొగరులను తాకిన గండ శిలలు అనూహ్యామైన సౌందర్యాలను విరజిమ్ముతున్నాయి. 'మన ప్రతిభా ప్రాభవాలను ఈ శిల్ప సంపద, ఒక చక్కని ప్రతీక' అన్నారు - సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు.

ఈ ప్రతిభా ప్రాభవాలకు వారసుడే మన ఆగమయ్య. ఆగమయ్య చేతిలో నల్లరాళ్ళు నలువ రాణులుగా మారడం, బండరాళ్ళు అందాల బొమ్మలుగా రూపెత్తడం చాలా మామూలు. ఒక రాయిని చూస్తూనే దాని చహరాలన్నీ ఇట్టే గ్రహించగలడు ఆగమయ్య. ఆ రాయి ఏ శిల్పానికన్నా పనికొస్తుందో రాదో కంటి కొసతో చూచి చెబుతాడు. ఒక్కోరాయి పైకి బాగానే వుంటుందిగానీ లోపల దోషం ఉంటుందిట. అలాంటి రాళ్ళు శిల్పాన్ని చెక్కడానికి అసలే పనికిరావంటాడు ఆగమయ్య.

అతని పూర్వీకులది కర్నూలు మండలం. అక్కడ కొంత భూవసతి కూడా ఉండేది. కానీ ఆ పొలం తొండలు గుడ్లు పెట్టడానికి తప్ప మరెందుకూ పనికిరాదుట.

"బనగానిపల్లె నవాబుకు మా నాన్న రాతితో మంచం చేసియిచ్చాడు. అంతా మామూలుగా మంచంగానే ఉంటుందండీ. నాలుగు కోళ్ళు, రెండు నిలువు పట్టెలు, రెండు అడ్డపట్టెలు పైకి కనపడేలాగా కూసాలు- అంతా మామూలువేనండీ, కొయ్య కోళ్ళను కూడా ఆ విధంగా తరణిపట్టాలంటే ఇప్పుడు కుదరదు. నులక తప్ప అంతా రాతితో చేసిందే. మళ్ళా ఇదంతా ఒక్క రాయితోనే చేయాలండీ" అన్నాడు ఆగమయ్య పాత జ్ఞాపకాలను కళ్ళముందుకు తెచ్చుకుంటూ.

అసలు అలా మంచాన్ని చేయడానికి పూనుకోవడమే ఆశ్చర్యం. ముందుగా అందుకు పనికొచ్చే రాతిని ఎన్నుకోవాలి. అదో గొప్ప యజ్ఞం చేసినంత పని. ఆ తరువాత దాన్ని పట్టెలుగా మంచం కోళ్ళుగా మలచాలి. ఆ మలచడంలో కాస్త పొరపాటు జరిగి ఇంత కద్దుబెచ్చిక రాలిపడినా అంతదాకా పడిన శ్రమ యావత్తూ బూడిద పాలయిపోతుంది. ఒక సందర్భంలో అలా జరిగిందట కూడా.

"అమ్మవారి విగ్రహం చేస్తున్నాను. నాలుగడుగులకు పైగా ఉంటుంది ఎత్తు. అంతా శాస్త్ర ప్రకారం, సంప్రదాయ ప్రకారంగా ఉండాలి గదా! కాలివేళ్ళ మట్టెలు చెక్కుతున్నాను. ఏ దోషం తగిలిందో, ఏ దిష్టి తగిలిందో తెలియదు. సగానికి సగం పాదం విరిగి ముందుపడింది. నా ఆవజీవాలు కుంగిపోయాయి. సాటి వాళ్ళముందు తల నేలపడినంత పనయింది. రెండు రోజులు గంగ ముట్టలేదంటే నమ్మండి. మా పెద్దన్నయ్య సముదాయించాడు. ఇది పనికాదనుకుని ఈసారి దేవాలయం ముందే కూర్చున్నాను. చుట్టూ గోనెపట్టాలు కట్టించుకొన్నా. ఎవర్నీ లోపలకు రానివ్వలా. నేలమీద ఆర్రోజులకల్లా 'అమ్మ విగ్రహం' తయారయింది. అన్ని రోజులూ వొంటి పూట భోజనం తప్ప సాయంకాలాలు ఫలహారం కూడా ఎరుగనండీ" అన్నాడు ఆగమయ్య.

## 25

ఇదెప్పుడో జరిగిన సంగతి. ఒక విశ్వాసంతో, నమ్మకంతో, దీక్షతో, తినడానికి వుండి కూడా ఒక్క పూటనే భోజనం చేశాడు ఆగమయ్య. అప్పుడు అతని నమ్మకాలతో, విశ్వాసాలతో మనకు పనిలేదు. ఇప్పుడు మాత్రం తరచుగా వొక్కపూటే నాలుగు మెతుకులు నంజుతున్నాడు ఆగమయ్య. ఇందుక్కారణం దీక్ష, విశ్వాసం కాదు. అక్షరాలా దరిద్రం కారణం.

శాస్త్రాలనూ, సంప్రదాయాలను గురించి, ఇంతగా మాట్లాడే ఆగమయ్య ఏమీ చదువుకోలేదంటే ఆశ్చర్యం వేస్తుంది. ఈ శాస్త్ర రహస్యాలన్నీ వంశపారంపర్యంగా వారికి వస్తున్నాయట. ఈ వివరాలన్నీ తనతోనే నశించిపోతున్నందుకు అతను చాలా బాధపడ్డాడు.

“లాభం లేదండీ. ఈ వృత్తిని నమ్ముకుంటే పొట్టగడవదు. జనంలో దేవుడిమీద నమ్మకం తగ్గిపోతున్నది. ఉన్న గుళ్ళూ గోపురాలే మాగుడేసి పోతుంటే, కొత్తవి కట్టించేదెవరు చెప్పండి? అలా కట్టించే పుణ్యాత్ములు ఉన్నప్పుడు గదా నాలాంటి వాళ్ళ అవసరం”అన్నాడు ఆగమయ్య బాధతో నిండిన ముఖాన్ని చిరునెర్రిలిచ్చిన అరచేతులతో రుద్దుకుంటూ.

శిల్పాలు చెక్కించేవారు లేకా, అడపాదడపా, ఎక్కడో నూటికి, నోటికీ వొకరున్నా వారిచ్చేది గిట్టుబాటు కాక ఆగమయ్య, ఆ వృత్తిని దాదాపుగా మానేశాడు. శతాబ్ధాల తరబడిగా శిలలతో కలసిమెలసి కలగలిసిపోయిన అతని విద్య, తరాల నుండీ రమనీలలామలను ఆవిష్కరించిన అతని ప్రతిభ ఈనాడు పిడికెడు మెతుకుల్ని అతనికి అందించలేకపోతున్నది. అందుకే అతనిప్పుడు, రాళ్ళకూ, కుందులకూ ‘కక్కు’ కొడుతున్నాడు. పొత్రాలు తయారు చేస్తున్నాడు. సన్నెకళ్ళు తయారు చేస్తున్నాడు.

“ఇదీ లాభం లేదు బాబుగారూ! ఒక రోలు కొంటే రెండుతరాలు గడుస్తుంది. ఒక పొత్రంతో పది కుటుంబాలు గడుపుకొంటాయి. ఇందులోనూ బోలెడంత పోటీ. ఇప్పుడు వీటిని అందరూ తయారు చేస్తున్నారు. కారు చవగ్గా అమ్ముతున్నారు. ఒక్కోసారి కూలి గూడా గిట్టదండీ’ అన్నాడు ఆగమయ్య బొంగురుపోయిన గొంతుతో.

అది నిజమేగాని, అంత మాత్రాన కుటుంబపు ఖర్చులేమీ తగ్గవు గదా. బతికున్నంత కాలమూ, ఈ జానెడు పొట్టకూ గంజో, గటకో ఇంత పొయ్యాల్సిందేగదా. అందుకోసం అతను రాళ్లుకొట్టే పనిక్కూడా తయారయ్యాడు. ఏ అయ్యనో కాళ్ళూ కడుపూ పట్టుకొని నాలుగొందలు తెచ్చుకున్నాడు. ఆ నాలుగొందలూ, నాలుగు ముఠాలకు అడ్వాన్సుగా యిచ్చి, కంకర కొట్టించాడు. తయారయిన కంకరను రోడ్ల కంట్రాక్టరుకు అమ్ముదామని, కూలీలకివ్వాల్సింది ముద్దర సుద్ధిగా యిచ్చేసి మిగిలిందానితో ముడుచుకుందామని అనుకొన్నాట్ట. రెండు విడతలదాకా బాగానే జరిగిందట. పెద్దగా మిగిలి చచ్చిందేమీ లేకపోయినా కటిక పస్తులు మాత్రం చేయవలసిన బెడద తప్పిపోయిందనుకొన్నాట్ట.

“అంతా నాశనమయిపోయిందండీ. అడ్వాన్సు తీసుకొన్నవాళ్ళు బాకీ తీర్చకుండానే మకాం ఎత్తేశారు. ఎక్కడికెళ్ళారో కూడా తెలియదు. నేను వెతకనుకూడా లేదు. వెతికితే కనిపించారే అనుకోండి. ఏం లాభం చెప్పండి. వాళ్ళదగ్గరైనా ఏముంటుంది గనక వసూలు చేయడానికి” అన్నాడు ఆగమయ్య మెక్కవోయిన సుత్తెకేసి చూస్తూ.

అది కూడా ఆగమయ్య బతుకులాగే బండబారిపోయి వుంది. ఆగమయ్యకి ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయిని మేనల్లుడికే యిచ్చి పెళ్ళి చేశాడు. అతనికి కడపలో ఓ చిన్న సైకిల్ షాపు

వున్నదట. "నాకోసం ఎదురు చూడకుండా, వాళ్ళ గంజి వాళ్ళు తాగుతున్నారు" అన్నాడు ఆగమయ్య. బహుశా అదొక్కటేనేమో అతనికి కాస్త తృప్తినిచ్చింది.

తన ఉక్కువులితో, శానంతో, పొగరుతో, పోత పొడుస్తూ రాళ్ళలో నిద్రించే రమణీయతను మేల్కొలిపి అందరిముందూ వుంచిన ఆగమయ్య. యుగయుగాల భారతీయ సంస్కృతికి ఆలవాలంగా నిలిచిన దేవతా విగ్రహాలను అలవోకగా మలిచే ఆగమయ్య శిలా స్తంభాలనుండి సంగీత ఝురులను ఉరుకులెత్తించగల ఆగమయ్య పిడికెడు మెతుకులకోసం రోడ్డు వారనున్న చింత చెట్టుక్రింద కూచొని, రాళ్ళను కంకరకింద కొడుతున్నాడిప్పుడు.

ప్రతి వారూ తమ శ్రమకు తగిన ప్రతిఫలం తమకు లభించడం లేదనడం నాకు తెలుసు. ఇలా అంటున్నవారు మిటమిటలాడే ఎండలో, చెమటలు కక్కుకొంటూ, బండరాళ్ళను బద్దలు కొట్టేవారి గురించి మాట్లాడరు. కనీసం ఆలోచించనన్నా ఆలోచించరు. నిజానికి ఇలాంటి పనిచేస్తున్న వారి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తున్నదా అంటాడు 'మాక్సిం గోర్కి' వొక సందర్భంలో.

దీనికి మీరేం సమాధానం చెబుతారు?